

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 13-03-2026 సంపుటి : 07 సంచిక 293 పేజీలు : 8 వెల : రూ 3-00

# భారత్‌లో ఇంధన కొరత లేదు..

### లోక్‌సభలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్

న్యూఢిల్లీ: ఇండియాలో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ లభ్యతపై ఆందోళన నెలకొనడంతో కేంద్ర మంత్రి లోక్‌సభలో మాట్లాడారు.'ఆధునిక ఇంధన చరిత్రలో ప్రపంచం ఇలాంటి క్లిష్ట సమయాన్ని మునుపెన్నడూ ఎదుర్కోలేదు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సురక్షితమైన సరఫరాలను సమకూర్చుకుంది. హర్మ్యాజ్ సంక్షోభంతో భారత్‌కు సంబంధం లేదు. హర్మ్యాజ్ జలసంధి భారత్‌కు తెరిచారు. ప్రధానమంత్రి చర్చలతో పరిస్థితులు సర్దుకుంటున్నాయి' అని హర్దీప్ సింగ్ తెలిపారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కునేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు.డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి వివరించారు. సిలిండర్ల సరఫరాలో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25 రోజుల వ్యవధి, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎల్ఎన్‌జీ కార్గోలు దాదాపు ప్రతిరోజూ ప్రత్యామ్నాయ సరఫరా రూట్లలో ఇండియాకు వస్తున్నాయని తెలిపారు. ఒకవేళ ఘర్షణలు సుదీర్ఘకాలం కొనసాగినప్పటికీ తగినంత గ్యాస్ ఉత్పత్తి, సరఫరా ఏర్పాట్లు చేయగలిగే స్థితిలో ఇండియా ఉందని అన్నారు. గృహాలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు.రిఫైనరీలకు తగిన ఆదేశాలు ఇవ్వడం ద్వారా గత ఐదు రోజులుగా 28 శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెరిగినట్టు హర్దీప్ సింగ్ పురి తెలిపారు. లక్షలాది భారతీయ కుటుంబాల వంటిళ్లలో ఎలాంటి కొరత లేకుండా చూసేందుకు మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, డొమిస్టిక్ సప్లయ్‌కు పూర్తి భరోసా ఉందని చెప్పారు.




# పెట్టుబడుల అమలు లో..

### కలెక్టర్లు ప్రో యాక్టివ్ గా వ్యండాలి
### స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్సులో జిల్లాల వారీగా ర్యాంకులు
### సీఎం చంద్రబాబు



అమరావతి,రెండో రోజు జిల్లా కలెక్టర్ల సదస్సులో రాష్ట్రంలో పెట్టుబడి ప్రతిపాదనలపై సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారు. పెట్టుబడుల ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేసారు. స్పీడ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ విషయంలో జిల్లా కలెక్టర్ల మధ్య పోటీ పెట్టాలని సీఎం సూచించారు. పెట్టుబడులు రాబట్టడం... వాటిని గ్రౌండ్ అయ్యేలా చూడడంలో కలెక్టర్లు ప్రోయాక్టీవ్ గా ఉండాలని సీఎం ఆదేశించారు.జిల్లాల్లో ఉన్న అవకాశాలు, అనుకూలతల ఆధారంగా పెట్టుబడులు సహా వివిధ రంగాలను ప్రొత్సహించేలా కలెక్టర్లు ప్రణాళికలు సిద్దం చేయాలని అన్నారు.ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులను వేగంగా గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాలి. పెట్టుబడులను ఆకర్షించేలా జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. పెట్టుబడులు వస్తే... స్థానికంగా యువతకు ఉపాధి, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతాయి. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ డెవలప్మెంట్ ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ రీజిజయన్ కు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, మరావతికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ , తిరుపతి రీజియన్ కు ముఖేష్ కుమార్ మీనా బాధ్యత వహిస్తారు. రీజియన్ల వారీగా పరిశ్రమలు, పెట్టుబడులు, ఆయా ప్రాంతాల ఆర్థికాభివృద్ధి బాధ్యతను ఈ అధికారులు తీసుకుంటారు. పెట్టుబడులపై ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షించి ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని అన్నారు.అనుమతులు వేగంగా ఇవ్వటంతో పాటు భూ కేటాయింపులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరిగేలా చూడాలి. పరిశ్రమలకు నీటిని ఇస్తేనే వేగంగా ఉత్పాదన ప్రారంభిస్తారు. ఓర్వకల్లులో పారిశ్రామిక క్లస్టర్ రూపకల్పన చేశాం. ఇప్పుడు ఎయిర్ పోర్టు లాంటి మౌలిక సదుపాయాలు కూడా వచ్చాయి. ఇప్పుడు భవిష్యత్తులో ఓ మేజర్ పారిశ్రామిక హబ్ గా మారుతుంది. కడప జిల్లాలో కొప్పర్తి కూడా ఆ పారిశ్రామిక క్లస్టర్ గా తయారు కావాలి. జిల్లాల్లో పెట్టుబడులు మీటింగులు పెట్టాలి. పెట్టుబడులు రాబట్టేందుకు కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్సులో జిల్లాల వారీగా ర్యాంకులిస్తాం. 2019-24లో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. అమర్ రాజా కంపెనీ తిరుపతిలో కార్పోరేట్ ఆఫీస్ పెట్టింది... వారినీ గత పాలకులు పారిపోయేలా చేశారు. 2014-19లో పరిశ్రమలకు ఇచ్చిన భూములను గత ప్రభుత్వం వేరే అవసరాలకు వాడేసింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏపీని బెంగళూరుకు పోటీగా తీర్చిదిద్దాం. వై రా న్ట్ లివబుల్ సిటీగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాం... ఎకో సిస్టం కల్పించాం. ఇప్పుడు ఆ ఫలితాలు హైదరాబాద్ అనుభవిస్తోంది.ఇప్పుడు రాష్ట్రం మొత్తం అదే తరహా ఎకో సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా జిల్లాల్లో పరిశ్రమలు రాకుంటే ఆ జిల్లాల్లో టూరిజం ప్రమోట్ చేయాలి... లేదా ఐటీని ప్రమోట్ చేయాలి... ఎస్ఎంఈలు ప్రమోట్ చేయాలి.. అగ్రికల్చర్ ప్రమోట్ చేయాలి. ఇలా ఏదోక రంగంలో ఆయా జిల్లాలకున్న ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకుని.. అనుకూలతలను దృష్టిలో పెట్టుకుని ఆయా రంగాల్లో అభివృద్ధి చేయాలి. ఆయా జిల్లాలకున్న అడ్వాంటేజీలను ప్రమోట్ చేయాలి.. పెట్టుబడులను ఆకర్షించాలి. అందరూ తమ దగ్గరకే రావాలని జిల్లా కలెక్టర్లు... మంత్రులు అనుకోకూడదని అయన అన్నారు.

# గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, మార్చి 12: ఇరాన్, అమెరికా - ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. గురువారం లోక్‌సభలో దేశంలో వంట గ్యాస్ కొరతపై రాహుల్ గాంధీ ప్రసంగించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా - ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హార్ముజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు.గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. రష్యా ఆయిల్‌ను కొనడానికి ఎవరి అనుమతి కావాలి? అంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రాన్ని నిలదీశారు.భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తన ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికిందన్నారు. ఎప్‌స్టీన్‌తో పరిచయం ఉందని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ చెప్పారని ఈ సందర్భంగా ఎంపీ రాహుల్ గాంధీ గుర్తు చేశారు.పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు.

# గుడ్ న్యూస్.. ఏపీకి మరో పరిశ్రమ..

### శంకుస్థాపన చేసిన లోకేశ్



నెల్లూరు, మార్చి12: సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ పరిశ్రమ ఏపీకి వస్తున్నందుకు ఆనందంగా ఉందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ పరిశ్రమ వల్ల స్థానిక మత్స్యకారుల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ పరిశ్రమకు లోకేశ్ శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ వల్ల 25 వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. రాష్ట్రానికి సుదీర్ఘ సముద్ర తీరం ఉండడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని గుర్తు చేశారు.ఒక వైపు రక్షణ శాఖకు సంబంధించినవి తయారు చేస్తూ.. మరో వైపు మత్స్యకారులకు ఈ సంస్థ సహకారం అందిస్తుందని చెప్పారు. స్వల్ప ఖర్చుతో కూడిన శ్రమతో అధిక ఆదాయం పొందేలా ఈ పరిశ్రమ పని చేస్తుందన్నారు. మత్స్యకారులు చాలా క్రమశిక్షణతో ఉంటారని వివరించారు. గతంలో తాను చేపట్టిన యువగళం పాదయాత్ర సమయంలో ఈ గ్రామ ప్రజలు రహదారులను అలంకరించి స్వాగతం పలికారని.. ఇది తన జీవితంలో మరిచిపోలేనని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.ఇక ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ సర్కారు ఉందన్నారు. నమో.. అంటే నారా చంద్రబాబు, మోదీ అని అభివర్ణించారు. చంద్రబాబు విజనరీ.. హైదరాబాద్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించారని వివరించారు. అందుకే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నారని చెప్పారు.ఇదే సమావేశంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అద్భుతమైన పరిశ్రమ నెల్లూరు జిల్లాకు రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, కంపెనీ ఎండీ నికుంజ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వదేశీ రక్షణ తయారీకి సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్ ఊతం: మంత్రి నారాయణ

అమరావతి, మార్చి 12 ): నెల్లూరు జిల్లాలో సాగర్ డిఫెన్స్ అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ సిస్టమ్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయడం రాష్ట్రానికి గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే మొదటి కేంద్రంగా రూపుదిద్దుకోబోతున్న ఈ ప్రాజెక్టు భారతదేశ స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనుందని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.ఈ ప్రాజెక్టు సముద్ర సాంకేతికతలో నూతన ఆవిష్కరణలకు దారి తీస్తూ, మత్స్యకార రంగం, పారిశ్రామిక నైపుణ్యాల అభివృద్ధికి ఊతమివ్వనుందని తెలిపారు. తీర ప్రాంత పర్యవేక్షణ, భద్రత, రక్షణ సిద్ధతను మరింత బలపరచడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని చెప్పుకొచ్చారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెకు తీసుకురావటంలో కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు.




# సంపాదకీయం

శుక్రవారం 13-03-2026

## ఏళ్ల నరకయాతనకు సుప్రీం విముక్తి

సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కారుణ్య మరణాలు ఇటీవల పెరుగుతున్నాయి. కారణం ఏదైనా కారుణ్య మరణం కోసం కోర్టును ఆశ్రయిస్తున్నారు. విచారణ తర్వాత చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయి. అయితే కొన్నింటిని మాత్రం కోర్టు కూడా అంగీకరిస్తోంది తాజాగా 13 ఏళ్లుగా కోమాలో ఉన్న 32 ఏళ్ల హరీశ్ రాణాకు సుప్రీంకోర్టు కారుణ్య మరణం అనుమతించడం భారత న్యాయ చరిత్రలో చారిత్రాత్మక సంఘటనగా నమోదైంది. అతడికి ప్రాణాధార చికిత్స వ్యవస్థలను తొలగించడానికి సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దేశంలో ఈ విధానానికి మొదటి సారి ఇచ్చిన అనుమతి.ఓ మనిషి కారుణ్య మరణానికి అనుమతినిచ్చింది. 12 సంవత్సరాలకు పైగా కోమాలో ఉన్న 31 ఏళ్ల వ్యక్తికి సుప్రీంకోర్టు బుధవారం పాసివ్ యుథనేషియా మంజూరు చేసింది. అతని కృత్రిమ లైఫ్ సపోర్ట్‌ను తొలగించాలిన సుప్రీంకోర్టు ఆదేశించింది. పాసివ్ యుథనేషియా అనేది ఒక రోగిని ఉద్దేశపూర్వకంగా ప్రాణాలతో ఉంచడానికి అవసరమైన లైఫ్ సపోర్ట్. ఇతర చికిత్సను నిలిపివేయడం ద్వారా చనిపోవడానికి అనుమతించే ప్రక్రియ.ఘజియాబాద్‌కు చెందిన 31 ఏళ్ల హరీష్ రాణాకు దేశ అత్యున్నత న్యాయస్థానం నిష్క్రియాత్మక కారుణ్య మరణాన్ని మంజూరు చేసింది. తన కొడుకు మరణాన్ని కోరుతూ తండ్రి సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకున్నాడు. న్యాయమూర్తులు జెబి పార్దివాలా, కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.అనాయాస మరణం కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ, జస్టిస్ జె.బి. పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. “దేవుడు మనిషిని జీవితాన్ని అంగీకరిస్తున్నాడా లేదా అని అడగడు, జీవితాన్ని అతనే తీసుకోవాలి.” అని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాలుగా మంచం పట్టిన 31 ఏళ్ల హరీష్ రాణాకు ఇప్పుడు కారుణ్య మరణం మంజూరు కానుంది. గౌరవప్రదమైన మరణ హక్కును గుర్తిస్తూ 2018 కామన్ కాజ్ నిర్ణయం తర్వాత కారుణ్య మరణం అనేది మొదటి న్యాయపరమైన నిర్ణయం. తన తీర్పును వెలువరించే ముందు, హరీష్ కోలుకునే అవకాశం లేదని తేల్చిన రెండు కోర్టు నియమించిన వైద్య బోర్డుల నివేదికలను ధర్మాసనం పరిశీలించింది.ఘజియాబాద్‌లోని రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో నివసించే హరీష్ తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం, అతను 12 సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యాడు. అతనికి ద్రవ ఆహారం మాత్రమే ఇస్తున్నారు. 2013లో తన ఇంటి నాల్గవ అంతస్తు నుంచి పడిపోవడంతో హరీష్ రాణా తలకు తీవ్ర గాయాలయ్యాయి. దశాబ్ద కాలంగా కోమాలో ఉన్నాడు. వైద్య చికిత్సను ఉపసంహరించుకునేలా హరీష్‌ను పాలియేటివ్ కేర్‌లో చేర్చాలని ధర్మాసనం ఎయిమ్స్ ను ఆదేశించింది. అతని గౌరవాన్ని కాపాడుకోవడానికి ఒక నిర్దిష్ట ప్రణాళికతో ఈ ఉపసంహరణ చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది.తీర్పు వెలువరించే ముందు హరీష్ రాణా తల్లిదండ్రులను కలవాలని సుప్రీంకోర్టు కోరిక వ్యక్తం చేసింది. ఢిల్లీకి చెందిన ఎయిమ్స్‌కు చెందిన సెకండరీ మెడికల్ బోర్డ్ ఆఫ్ డాక్టర్లు దాఖలు చేసిన హరీష్ రాణా మెడికల్ రిపోర్టుతో కూడిన నివేదికను చూసి, అది విచారకరమైన నివేదిక అని పేర్కొంది. రోగి పరిస్థితిని పరిశీలించిన తర్వాత, ప్రాథమిక వైద్య బోర్డు అతను కోలుకునే అవకాశం చాలా తక్కువ అని తేల్చి చెప్పింది. డిసెంబర్ 11న, ప్రాథమిక వైద్య బోర్డు నివేదిక ఆ వ్యక్తి పరిస్థితి చాలా విషమంగా ఉందని సూచించిందని సుప్రీంకోర్టు పేర్కొంది. 2023లో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, రోగికి కృత్రిమ లైఫ్ సపోర్ట్‌ను తొలగించడంపై నిపుణుల అభిప్రాయాన్ని పొందడానికి ప్రాథమిక, ద్వితీయ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయడం తప్పనిసరి అయ్యింది. అరుణాకు కారుణ్య మరణం అనుమతించాలని జర్నలిస్ట్ పింకీ విరాణి సుప్రీంకోర్టులో 2011లో పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు చికిత్సను నిలిపివేసి సహజ మరణం (పాసివ్ యూతనేషియా) అనుమతించాలని నిర్ణయించింది, కానీ బాధితుడి తల్లిదండ్రులు, భాగస్వామి లేదా సన్నిహితుల అనుమతి తప్పనిసరిగా నిర్దేశించింది. 'నెక్స్ట్ ఫ్రెండ్'గా పింకీని నిరాకరించి, ఆసుపత్రి సిబ్బందిని సూరిగా నియమించింది, వారు చికిత్స నిలిపివేయడానికి ఒప్పుకోకపోవడంతో పిటిషన్ తిరస్కరించబడింది. నాలుగు దశాబ్దాలుగా జీవచ్ఛవం వల్ల ఉన్న అరుణా 2015లో న్యూమోనియాతో మరణించిందిఅరుణా కేసు ఆధారంగా 2018లో సుప్రీంకోర్టు 'గౌరవప్రద మరణం'ను ప్రాథమిక హక్కుగా గుర్తించి పాసివ్ యూతనేషియాను అధికారికంగా చట్టబద్ధం చేసింది. హరీశ్ రాణా (ఇంజినీరింగ్ విద్యార్థి) 2013లో చండీగఢ్ యూనివర్సిటీ హాస్టల్ నాలో అంతస్తు బాల్కనీ నుంచి పడిపోయి తలకు తీవ్ర గాయం కారణంగా 13 ఏళ్లు కోమాలో ఉన్నాడు. తల్లిదండ్రులు సుప్రీంకోర్టుకు అనేక సంవత్సరాలు పిటిషన్ చేసిన తరువాత, వైద్య నివేదికల ఆధారంగా మార్చి 2026లో చికిత్స తొలగించడానికి అనుమతించింది, ఇది అరుణా మార్గదర్శకాల ప్రకారం మొదటి సారిగా ఇచ్చిన తీర్పుప్రస్తుత కేసులో చికిత్స నిలిపివేత ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించవచ్చని సుప్రీంకోర్టు ధర్మాసనం తన నిర్ణయంలో పేర్కొంది. ప్రాథమిక , ద్వితీయ బోర్డులు నిలిపివేతను నిర్ధారించిన తర్వాత, కోర్టు జోక్యం అవసరం లేదు. ఇది మొదటిది కాబట్టి, ఈ విషయాన్ని కోర్టుకు సూచించడం సముచితంగా పరిగణించకూడదని ధర్మాసన పేర్కొంది. రోగులకు చికిత్స నిలిపివేత ప్రక్రియ మానవీయంగా ఉండాలి, దీనికి ఒక క్రమబద్ధత అవసరమని సుప్రీంకోర్టు తెలిపింది.

# జూన్ నాటికి గ్రీన్ ఫీల్డ్ హైవే రెడీ

నల్గొండ, మార్చి 12, (న్యూస్ పల్స్) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను అనుసంధానిస్తూ ఖమ్మం–దేవరపల్లి మధ్య నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే జూన్ నాటికి అందుబాటులోకి రానుంది. 162 కిలోమీటర్ల పొడవైన ఈ హైటెక్ రహదారి పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఆధునిక సాంకేతికతతో రూపొందుతున్న ఈ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా హైదరాబాద్ – విశాఖ మధ్య ప్రయాణ సమయం, దూరం గణనీయంగా తగ్గి రవాణా, వాణిజ్య రంగాలు బలోపేతం కానున్నాయి.తెలంగాణ–ఏపీ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ రెండు తెలుగు రాష్ట్రాల రవాణా ముఖచిత్రాన్ని మార్చబోతోంది. సుమారు 4,451.87 కోట్ల అంచనా వ్యయంతో, 162.4 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఈ హైటెక్ రహదారి పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. తెలంగాణలో మొట్టమొదటి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేగా రికార్డు సృష్టించనున్న ఈ రహదారి.. ఈ ఏడాది జూన్ నాటికి వాహనదారులకు అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది.కేంద్ర ప్రభుత్వం భారత్ మాల పరియోజన పథకంలో భాగంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్టును పర్యవేక్షిస్తోంది. 2017లో ప్రతిపాదనలు సిద్ధం కాగా.. 2018లో కేంద్ర ప్రభుత్వం దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులకు దూరం, ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. ప్రస్తుతం సూర్యాపేట, విజయవాడ మీదుగా విశాఖకు వెళ్లాలంటే 676 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. కానీ, ఈ కొత్త కారిడార్ ద్వారా 80 కి.మీ ఆదా కావటమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు లేకుండా వేగంగా గమ్యాన్ని చేరుకోవచ్చు.ప్రస్తుతానికి గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ యాక్సెస్ కంట్రోల్ కలిగిన నాలుగు లైన్ల రహదారి. అయితే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా దీనిని ఆరు లైన్లుగా విస్తరించుకునేలా డిజైన్ చేశారు. ఈ రహదారికి బారికేడింగ్ ఉండటం వల్ల ఇతర వాహనాలు మధ్యలో వచ్చే అవకాశం ఉండదు. ప్రతి 18 కిలోమీటర్లకు ఒక ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, ప్రతి 5 కిలోమీటర్లకు అత్యవసర మీడియన్ ఓపెనింగ్స్ ఏర్పాటు చేశారు. వాహనదారులు సాయం కోసం 1033 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చు. మొత్తం మార్గంలో 10 ప్రధాన వంతెనలు, 295 కల్వర్టులు, 98 అండర్ పాసులు నిర్మిస్తున్నారు. ఏఐ సాంకేతికతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతినిత్యం నిఘా ఉంచుతారు.ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఖమ్మం జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందనుంది. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద ఈ హైవేకు ఎగ్జిట్ ఇచ్చారు. దీనివల్ల స్థానిక రైతులకు, వ్యాపారులకు తమ ఉత్పత్తులను వేగంగా మార్కెట్లకు తరలించే ఛాన్సుంది. హైవే పొడవునా గిడ్డంగులు, లాజిస్టిక్ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కావడానికి అవకాశం ఉంది. ఇప్పటికే 116 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కాగా.. మిగిలిన 10–20 శాతం ఫినిషింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.సోలార్ వెలుగులతో, హైటెక్ హంగులతో సిద్ధమవుతున్న ఈ కారిడార్ ఆంధ్ర–తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా.. సామాన్య వాహనదారులకు, ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు రెడీ అవుతోంది.

# ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ సామ్రాజ్యవాద దాడిని ప్రతిఘటించండి


**– సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి**

పరవాడ.(లంకెలపాలెం) అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాద దాడిని ప్రజలంతా వ్యతిరేకించాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ మండలం లంకెలపాలెం జాతీయ రహదారిపై యుద్ధ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ ఇరాన్ పై ట్రంప్ చేస్తున్న దాడులు అత్యధిక మంది అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. ఇరాన్ పై ఇజ్రాయిల్ , అమెరికాల సామ్రాజ్యవాద దాడిని ఖండించని కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని గని శెట్టి తప్పు పట్టారు. ఇరాన్ మన దేశానికి చిరకాల మిత్ర దేశం. మనకు అవసరమైన మూడు చమురులో అత్యధిక ఈ దేశం నుండి సరఫరా అవుతుంది. అలాంటి దేశంపై జరుగుతున్న ఈ క్రూర దాడులను కనీసం కేంద్ర బిజెపి ప్రభుత్వం ఖండించకపోవడం అమెరికా, ఇజ్రాయిల్ నేతలతో కేంద్ర బిజెపి పెద్దలకు ప్రభుత్వానికి ఉన్న కార్పొరేట్ అనుకూల. మతతత్వ అనుబంధం ప్రధానమైనదిగా కనబడుతుంది అని గని శెట్టి అన్నారు.అమెరికా యుధన్మాదాన్ని నిరసించాలని అన్నారు. యుద్ధం వద్దు శాంతి కావాలి అని నినాదాలు చేశారు.అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనంలో భాగంగా గత పది రోజులుగా ఇజ్రాయిల్ తో కలిసి అమెరికా ఇరాన్ పై చేస్తున్న యుద్ధం కారణంగా ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా భారతదేశంలో ప్రజలు కు తీవ్ర నష్టం కలుగుతుంది అన్నారు, వెంటనే యుద్ధాన్ని ఆపాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ ధరలను కేంద్ర బి జె పి ప్రభుత్వం పెంచిందని, మనదేశంలో హోటల్స్ సంక్షోభంలో చిక్కుకున్నాయి. కమర్షియల్ గ్యాస్ ధరలను భారీగా పెంచగా, క్షేత్రస్థాయిలో పిచ్చలవిడిగా జరుగుతున్న బ్లాక్ మార్కెటింగ్ తో హోటల్ యజమానులు దిక్కుతోచని పరిస్థితుల్లో చిక్కుకున్నారు. చిన్న హోటల్ రోడ్డు పక్కన బళ్ళు పై వ్యాపారాలు చేసుకునే వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలకు ఈ యుద్ధం అవకాశం ఇస్తుందని గని శెట్టి అన్నారు. చమురు నిక్షేపాల కోసం అమెరికా పన్నుతున్న కుట్రలను ప్రపంచ దేశాల్లో వ్యతిరేకిస్తున్నాయని, దేశంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం మౌనం వహించి పరోక్షంగా ఇజ్రాయిల్ కు సహకరిస్తోందన్నారు. యుద్ధంలో అమెరికా ఇరాన్ లో ఆసుపత్రిలు, పాఠశాలలపై బాంబుల వర్షంతో పసిపిల్లల ప్రాణాలు పోతున్నాయని అన్నారు. విశాఖపట్నంలో జరిగిన ఐ ఎఫ్ ఆర్ కి వచ్చి వెనక్కి వెళ్తున్న నౌకపై అమెరికా దాడి చేసి 100 మంది ఇరాన్ సైనికులను శ్రీలంక సముద్ర జలాల్లో హత్య గావించింది అని గని శెట్టి అన్నారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మారే చర్యలు విడనాడాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బొద్దపు. శ్రీనివాసరావు , అప్పికొండ గోవిందా, టి శ్రీను, జి సూరప్పారావు, టి .మహాలక్ష్మి నాయుడు, టి అప్పారావు, రాజు తదితరులుపాల్గొన్నారు.

# 'మత్తుకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలి'

**ఈగల్ ఫోర్స్ సీఐ హేమా రాణి పిలుపు**

జూలూరుపాడు, మార్చి 12 : మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని, యువత వీటికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఈగల్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హేమ రాణి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో పోలీస్, ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు' నిర్వహించారు. ?ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి సీఐ హేమ రాణి మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వల్ల గుండెపోటు, క్యాన్సర్, కాలేయం, ఊపిరితిత్తుల వ్యాధులు సంభవిస్తాయని, మెదడు పనితీరు మందగిస్తుందని తెలిపారు. మత్తుకు బానిసలైన వారిలో తీవ్ర ఆందోళన, డిప్రెషన్, ఆత్మహత్య ధోరణులు పెరుగుతాయని చెప్పారు. వ్యసనాల వల్ల కేవలం వ్యక్తే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయని, ఆర్థికంగా, చట్టపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వెల్లడించారు.ఎవరైనా డ్రగ్స్ తీసుకోమని బలవంతం చేసినా ధైర్యంగా 'నో' చెప్పే



సంకల్పం విద్యార్థుల్లో ఉండాలన్నారు. ?అమూల్యమైన మానవ జీవితాన్ని మత్తు పదార్థాలతో పాడు చేసుకోవద్దని విద్యార్థుల చేత సీఐ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమం చంద్రుగొండ క్రాస్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి, విద్యాశాఖ అధికారి బానోత్ జూంకిలాల్, పీహెచ్‌సీ వైద్యులు బానోత్ వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెచ్ఎం లక్ష్మీ నర్సయ్య, నేతాజీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# దుబాయ్, సౌదీ, ఖతార్‌లపై ఇరాన్ దాడులు.. ఇప్పటివరకు 24 మంది మృతి



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తుంటే ఇరాన్ మాత్రం గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. దుబాయ్, సౌదీ, ఖతార్ సహా యూఏఈ దేశాలపై దుబాయ్ దాడులు చేస్తోంది. ముఖ్యంగా అక్కడి అమెరికన్ ఆర్మీ బేస్‌లపై ఇరాన్ దాడులకు దిగుతోంది. తాజాగా గురువారం కూడా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు చేసింది. దుబాయ్‌లోని డౌన్ టౌన్ సిటీపై డ్రోన్ దాడి జరిగినట్లు, దీనివల్ల స్వల్పంగా నష్టం కలిగినట్లు దుబాయ్ అధికారులు తెలిపారు.అయితే, ఈ దాడి ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని కలగలేదని, స్వల్ప గాయాలు తగిలాయని తెలిపింది. మిడిల్ ఈస్ట్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ దాడిలో ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో 24 మంది మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మరణించిన వారిలో అమెరికాకు చెందిన వారు ఏడుగురు ఉన్నారు. గురువారం ఉదయం దుబాయ్ తీరంలోని పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఒక కంటైనర్ షిప్‌పై దాడి జరిగింది. ఈ దాడిలో నౌకా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని బ్రిటీష్ మిలిటరీ అధికారులు తెలిపారు. బహ్రెయిన్‌లోని ముహర్రక్ ఐలాండ్‌పై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. ఈ ఘటనలో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది.కువైట్‌లోని ఒక నివాస భవనంపై ఇరాన్ జరిపిన దాడిలో ఇద్దరు గాయపడ్డట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్ ప్రయోగించిన ఒక డ్రోన్‌ను రియాద్ సమీపంలో నేలకూల్చినట్లు సౌదీ అరేబియా తెలిపింది. ఇప్పటివరకు ఇరాన్ యుద్ధం కారణంగా జరిగిన దాడుల్లో మొత్తం 19 వాణిజ్య నౌకలపై దాడి జరిగింది. ఇంకోవైపున ఇరాన్‌తోపాటు లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది.

# సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారు : స్పీకర్ ఓంబిర్లా



విపక్షాలు తనకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. తాను ఎల్లప్పుడూ ప్రతి ఎంపీకి సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులుకారని చెప్పారు.లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి స్పీకర్ ఓంబిర్లా ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవని చెప్పారు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయన్నారు. ప్రధాని, మంత్రులు కూడా ఏదైనా ప్రకటన చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలని చెప్పారు.మైక్రోఫోన్‌లను ఆన్ లేదా ఆఫ్ చేయడానికి స్పీకర్ దగ్గర ఎలాంటి బటన్ ఉండదని అన్నారు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసని చెప్పారు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుందని తెలిపారు. తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తున్న విమర్శలకు ఓంబిర్లా ఈ విధంగా సమాధానం ఇచ్చారు. విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. మూజుబాని ఓటుతో అది వీగిపోయింది.రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం లాంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి. అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు దూరంగా ఉన్న స్పీకర్.. తీర్మానం వీగిపోగానే మళ్లీ యథావిధిగా విధులకు హాజరయ్యారు.

# అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయించాలి : ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 12: అర్హులైన బాలికలకు వారి తల్లిదండ్రులు హెచ్‌పీవీ టీకాలు వేయించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్‌పీవీ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి బాలికలకు టీకాలు వేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 నుండి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు ఈ టీకాలు వేయించాలని తెలిపారు. బాలికల ఆరోగ్యం కోసం ఎంతో అవసరమైన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు వైద్య శాఖను అభినందించారు. బాలకల ఆరోగ్య రక్షణలో భాగంగా హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) టీకా ఎంతో ముఖ్యమైనదని వెల్లడించారు. హెచ్‌పీవీ అనే వైరస్ వల్ల గర్భాశయ సెర్వికల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ టీకా వేసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గర్భాశయ సెర్వికల్ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ హెచ్‌పీవీ టీకా సురక్షితమైనదని, ప్రపంచ వ్యాప్తంగా వైద్య నిపుణులు సూచిస్తున్న సమర్థవంతమైన రక్షణాత్మక టీకాలలో ఒకటని పేర్కొన్నారు.బాలికల ఆరోగ్య భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# ఈ సారి వారసులకు షాక్ తప్పదా

తిరుపతి, మార్చి 12, 2024లో ఘోర పరాజయం. ఆల్‌మోస్ట్ వైసీపీ శూన్యం నుంచి తిరిగి బౌన్స్ బ్యాక్ కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయోగాలు చేసే పరిస్థితి లేదంటున్నారట వైసీపీ అధినేత జగన్. నియోజకవర్గాలపై పట్టున్న నేతలు..రాజకీయంగా అనుభవం ఉన్న లీడర్లు, కుల బలం ఉన్న నేతలకే మళ్లీ టికెట్ ఇచ్చే యోచనలో ఉన్నారట. కానీ చాలామంది నేతలు..వయోభారమనో..తాము యాక్టీవ్‌గా ఉన్నప్పుడే వారసులను రాజకీయాల్లోకి తేవాలని ఆశపడుతున్నారట. అందుకే తమ కొడుకు, కూతురుకు టికెట్ కావాలని ఇప్పటినుంచే అర్జీలు పెట్టుకున్నారట. ఇలా వైసీపీలో చాలామంది లీడర్ల వారసులు రాబోయే ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారట. 2024లోనే టికెట్ ఆశించిగా కొందరికి తప్ప..మిగతా చోట్ల తండ్రులనే రంగంలోకి దించారు. కొన్ని చోట్ల అధినాయకత్వాన్ని మెప్పించి ఒప్పించి కొందరు లీడర్లు తమ వారసులకు టికెట్లు ఇప్పించుకున్నా పరాభావం తప్పలేదు. దాంతో వైసీపీ హైకమాండ్ ఆలోచనలు మారాయని అంటున్నారు. ఈసారి ఎన్నికలు 2024 కంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనవి అని వైసీపీ పెద్దలు భావిస్తున్నారట. దాంతో వారసులకు నో చాన్స్ అన్న చర్చ అయితే ఫ్యాన్ పార్టీలో జోరుగా సాగుతోందని చెబుతున్నారు. గత ఎన్నికల్లో తిరుపతి నుంచి భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు భూమన అభినయ్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అలాగే చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టూ పోటీ చేసినా గెలవలేకపోయారు. దాంతో ఈసారి వీరి ప్లేస్ లో తండ్రులనే పోటీకి రెడీ కావాలని వైసీపీ హైకమాండ్ సూచించిందని అంటున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తిరిగి యాక్టివ్ అయ్యారని చర్చించుకుంటున్నారు. భూమన పార్టీ నేతలతో కూడా ఎక్కువగా సమావేశాలు జరుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని కూడా సంకేతాలు ఇస్తున్నారట. తన కుమారుడికి రాజకీయంగా ఎంతో భవిష్యత్తు ఉందని వైసీపీకి రాబోయే ఎన్నికలు కీలకం కావడంతో తానే పోటీకి సిద్ధమవుతున్నానని చెబుతున్నారట. ఇక మాజీ మంత్రి పేర్ని నాని అయితే మచిలీపట్నంలో తన కుమారుడినే పోటీకి పెట్టాలని చూస్తున్నారట. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అదే ఆలోచనలో ఉన్నారని..మరోసారి మోహిత్‌రెడ్డినే బరిలోకి దించబోతున్నారట. వీళ్లు ఆల్రెడీ పోటీ చేసి ఓడిన నేతలు. వాళ్లకు టికెట్ ఇచ్చేందుకు వైసీపీ అధిష్టానం సుముఖంగా లేదంటున్నారు. అలాంటిది మరికొందరు నేతలు రాబోయే ఎన్నికల్లో తమ కూతురు, లేదా కొడుకును బరిలోకి దింపాలనుకుంటున్నారు. అయితే కీలక స్థానాలలో తండ్రులే పోటీ పడితే మంచి రిజల్ట్స్ వస్తాయన్నది వైసీపీ హైకమాండ్ ఆలోచనగా చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స సత్యనారాయణ తన కుమారుడు బొత్స సందీప్‌ను చీపురుపల్లి నుంచి దించాలని అనుకుంటున్నారట. అలాగే మాజీ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి తన కుమార్తెకి టికెట్ కోరబోతున్నారట. శ్రీకాకుళంలో ధర్మాన సోదరులు తమ కుమారులనే పోటీకి దించే యోచనలో ఉన్నారని తెలుస్తోంది. అయితే జగన్ వీరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. వారసులకు టికెట్ ఇవ్వడం పక్కన పెట్టి..సీనియర్ లీడర్లను ఎంపీలుగా బరిలోకి దించాలనేది జగన్ ఆలోచనగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పోటీ చేసి ఓడిన వారసులకు మళ్లీ టికెట్ దక్కేనా? కొత్తగా వారసులకు సీటు ఇచ్చేందుకు జగన్ ఓకే చెప్తారా? అనేది ఇప్పటికైతే తేలని అంశంగా ఉంది. అయితే అధికారంలో ఉన్న టీడీపీ నెమ్మదిగా సీనియర్లను సైడ్ చేస్తూ యంగ్ లీడర్లకు అవకాశాలు ఇస్తుంటే.. వైసీపీ మాత్రం సీనియర్లను వదలకూడదని పట్టుదలగా ఉండటం ఆసక్తికరంగా మారింది.

# పాదయాత్రకు పక్కా ప్లాన్



విజయవాడ, మార్చి 12, దయాత్రకు గట్టిగానే ప్లాన్ చేస్తున్నారు. గతంలో ఆయన 16 నెలల పాటు పాదయాత్ర చేశారు. ఈసారి మాత్రం 18 నుంచి 20 నెలల సమయం పట్టే అవకాశం ఉంది ఆయన పాదయాత్రకు. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రారంభించారు. అయితే ఈ పాదయాత్ర మునుపటి మాదిరిగా కొనసాగే అవకాశం లేదు. ఎందుకంటే పాదయాత్ర అంటేనే ఖర్చుతో కూడుకున్న పని. అందుకే ఈసారి ఒక ప్లాన్ చేస్తున్నారట. ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలన్న ఆలోచనతో ఉన్నారట. నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందన్న సమాచారం ఉంది. పాదయాత్ర చేసే సమయానికి పునర్విభజన అనేది ఒక కొలిక్కి రానుంది. తద్వారా పెరిగిన నియోజకవర్గాలతో కలిపి అభ్యర్థులను ప్రకటించనున్నారు జగన్మోహన్ రెడ్డి. తద్వారా పాదయాత్ర బాధ్యతలను వారికి కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. 2017లో పాదయాత్ర ప్రారంభించారు జగన్మోహన్ రెడ్డి. పార్టీ ప్లీనరీ నిర్వహించి పాదయాత్ర మొదలు పెడుతున్నట్లు ప్రకటన చేశారు. నవరత్నాలు ప్రకటించారు. పనిలో పనిగా వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. కానీ ఈసారి మాత్రం ఎటువంటి ప్రకటనలు ఉండవని తెలుస్తోంది. నేరుగా పెరిగిన నియోజకవర్గాలతో కలిపి అభ్యర్థులను ప్రకటించి పాదయాత్ర మొదలు పెడతారని తెలుస్తోంది. తద్వారా ముందుగానే టికెట్ల విషయంలో క్లారిటీ ఇస్తే నేతలు బాగా కష్టపడుతారు అనేది ఒక అంచనాగా తెలుస్తోంది. అభ్యర్థులను ముందుగా ప్రకటించడం ద్వారా ఒక ఊపు తేవాలని చూస్తున్నారు. పైగా పాదయాత్రకు ఎటువంటి అడ్డంకులు ఉండకుండా చేయాలని భావిస్తున్నారు. 2023లో లోకేష్ పాదయాత్ర కొనసాగింది. ఆ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉంది. లోకేష్ పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు సృష్టించాలో అన్ని సృష్టించారు. అడ్డుకునే ప్రయత్నం చేశారు. చివరకు పాదయాత్రలో మైకులను సైతం తీసుకుపోయారు. వాహనాలను సైతం పట్టుకుపోయారు. పోలీసుల రక్షణ లేకుండా పోయింది. చివరకు లోకేష్ పాదయాత్రను మరింత డామేజ్ చేసేందుకు సోషల్ మీడియా సైన్యం కూడా రంగంలోకి దిగింది. ఎవరు టిడిపి నేతలు తెలుసుకోలేని పరిస్థితి అప్పట్లో పాదయాత్ర లో ఉండేది. దానిని తట్టుకొని పాదయాత్రను పూర్తి చేయగలిగారు లోకేష్. ఇప్పుడు కచ్చితంగా ఆ పరిస్థితి జగన్మోహన్ రెడ్డికి సైతం ఉంటుంది. మరి ఆయన తట్టుకొని నిలబడగలరా అన్నది చూడాలి. కళ్ళముందు బలమైన అధికారపక్షం ఉంది. గతంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి విడివిడిగా ఉండేవి. తెలుగుదేశం ప్రభుత్వం సైతం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. దారి పొడవునా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ ఆస్తులకు పార్టీ రంగులు వేసేసారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు గుర్తుగా వైసీపీ రంగులు వీరవిహారం చేశాయి. అయితే ఈసారి అది వర్కౌట్ కాదు. ఎందుకంటే ప్రభుత్వం ఖచ్చితంగా దృష్టి పెడుతుంది. కేంద్ర ప్రభుత్వం సైతం కలుగజేసుకుంటుంది. అటువంటి చర్యలను మూడు పార్టీలు అడ్డుకుంటాయి కూడా. అందుకే ఈసారి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర పై అనేక రకాల సందేహాలు ఉన్నాయి. వీటికి తోడు అనేక పాత కేసులు తెరపైకి వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ చాలా ఇబ్బందికరమే. మరి జగన్మోహన్ రెడ్డి ఎలా అధిగమిస్తారో చూడాలి.

# మెజారిటీ మంత్రులకు ఉద్వాసన..

## ఈ ఐదుగురికే ఛాన్స్..

విజయవాడ, మార్చి 12, రాజకీయాలు అన్నాక రకరకాల రూమర్లు వస్తుంటాయి. ముఖ్యంగా సర్వే సంస్థలు కొన్ని అంచనాలు వెల్లడిస్తుంటాయి.. అయితే అలా ఫలితాలు విడుదల చేసిన సర్వే సంస్థల విశ్వసనీయత బట్టి అవి ఆధారపడి ఉంటాయి. నమ్మాలా వద్దా అనేది ఎదుటి వ్యక్తి నమ్మకం బట్టి ఉంటుంది. అయితే తాజాగా సర్వేలు నిర్వహించే రైజ్ సంస్థ నిర్వాహకుడు ప్రవీణ్ పుల్లట రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగాదికి కానీ.. తరువాత కానీ మంత్రివర్గ విస్తరణ ఖాయమని చెబుతున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలోకి ఓ ఐదుగురిని తీసుకోవడం ఖాయమని చెప్పుకొస్తున్నారు. ఆయన పేరుతో సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. విపరీతంగా వైరల్ అవుతుంది. 2024 జూన్ 4న ఫలితాలు వచ్చాయి. అదే నెల 12న ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఓ 24 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఒక మంత్రి పదవిని ఖాళీగా ఉంచారు. పవన్ కళ్యాణ్ కీలకమైన నాలుగు శాఖలకు మంత్రి బాధ్యతలు తీసుకోవడంతో పాటు డిప్యూటీ సీఎం హోదా కూడా తీసుకున్నారు.. అయితే ఖాళీగా ఉన్న మంత్రి పదవి ఎమ్మెల్సీ నాగబాబుతో భర్తీ చేయనున్నారు. అదే సమయంలో కొత్తగా ఓ ఐదుగురిని మంత్రివర్గంలోకి తీసుకోనున్నారు. ప్రవీణ్ పుల్లట ఇదే విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ బెందాళం అశోక్, పల్లా శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, వేమిరెడ్డి లను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని డాక్టర్ ప్రవీణ్ పుల్లట వెల్లడించారు. ఇందులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన బెందా ళం అశోక్ ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. సౌమ్యుడుగా పేరు ఉంది. ఈసారి ఆయనకు చాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ఒకవైపు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని సమాచారం. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారు శ్రీనివాస్. మంత్రివర్గంలోకి తీసుకుంటారని భావించిన చివరి నిమిషంలో రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించారు. విస్తరణలో ఆయనకు తప్పకుండా ఛాన్స్ ఇస్తారని ప్రవీణ్ పుల్లట చెబుతున్నారు. అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు సైతం ఛాన్స్ ఉండనుంది. ఇప్పటికీ ఆయన సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. గతంలో మంత్రి పదవి చేపట్టారు. మరోవైపు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు ఛాన్స్ ఇస్తారని చెబుతున్నారు. ఆయన చంద్రబాబుతో పాటు లోకేష్ కు సన్నిహితుడు. పార్టీకి విలువైన సేవలు అందించారు. మరోవైపు నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఛాన్స్ తప్పకుండా దక్కుతుందని చెబుతున్నారు. ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు. ఎన్నికలకు ముందు తన భార్యతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఆమెను మంత్రివర్గంలోకి తీసుకుంటారని ప్రవీణ్ పుల్లట చెప్పుకొస్తున్నారు. గతంలో ఎన్నికలకు ముందు టిడిపి కూటమికి అనుకూలమైన ఫలితాలు ఇచ్చారు ప్రవీణ్ పుల్లట. అవి నిజమని తేలాయి. అందుకే ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి ఆయన మాటలు.

# ఆస్పత్రులలో ఏఐ సాయంతో వైద్య సేవలు

గుంటూరు మార్చి 12, ఏపీ ప్రభుత్వం ఏఐ సాయంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. 18 ప్రభుత్వాసుపత్రుల్లో సుమారు 40 పరికరాల ద్వారా పైలట్ ప్రాజెక్టు కింద సరికొత్త ఆవిష్కరణల ద్వారా వైద్య సేవల్లో కీలకమైన స్క్రీనింగ్, కన్ఫర్మేషన్ పరీక్షలు చేస్తున్నారు. ఈ మేరకు తక్కువ సమయంలో వ్యాధులు ఖరారు చేయడం, అత్యుత్తమ వైద్యం అందిచొచ్చని చెబుతున్నారు అధికారులు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఐ సేవల్ని అందుబాటులోకి తీసుకురావాని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 18 స్టార్టప్ సంస్థలతో కలిసి వైద్య పరీక్షలు, ఇతర సేవల్ని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏఐ సేవలతో అతి తక్కువ సమయంలో వ్యాధి నిర్ధారణ, రోగులకు చికిత్స అందించే సమయం కూడా ఆదా అవుతుందంటున్నారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రులు.. పార్వతీపురం, రాజానగరం, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి, తెనాలిలోని జిల్లా ఆస్పత్రి, ఇతర చోట్ల పైలట్ ప్రాజెక్టు విధానంలో ఈ సేవల్ని ప్రారంభించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా వీటి ఫలితాలను విశ్లేషించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదక ఇస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. వ్యాధుల్ని ప్రాథమిక పరీక్షలతో గుర్తించి.. తక్కువ సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించొచ్చు. డాక్టర్లు, పేషెంట్ల మధ్య సంభాషణ రికార్డు చేస్తారు ఏఐ అప్లికేషన్ల సాయంతో పరీక్షలు చేసి ప్రాథమిక దశలోనే సమస్యల్ని గుర్తిస్తున్నారు. ఆయా ఆస్పత్రుల్లో క్యాన్సర్ గుర్తింపు, క్షయను గుర్తించడానికి, షుగర్, కిడ్నీ, థైరాయిడ్, రక్తపరీక్షలు కూడా ఏఐ ఆధారిత పరికరాలతో చేస్తున్నారు. గుండె సమస్యలు, ఐసీయూలో ఉన్నవారికి బీపీ, పల్స్, టెంపరేచర్, ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షణ లాంటి మరికొన్ని చోట్లో అందుబాటులో ఉన్నాయి. ఏఐ సాయంతో ఏపీ ప్రభుత్వం వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు మంత్రి సత్యకుమార్. రాష్ట్రంలో ఎంపి క చేసిన 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకేసారి 40 పరికరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. విశాఖపట్నంలో 'పింక్ సఖి శారీ వాక్' నిర్వహించారు.. క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వాక్‌ను రాహుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాక్‌కు సినీ నటి, లైఫ్ ఎగైన్ సంస్థ వ్యవస్థాపకురాలు గౌతమి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఈ అవగాహన ర్యాలీలో నగరానికి చెందిన మహిళలు భారీగా పాల్గొన్నారు.

# ఏపీలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

నెల్లూరురు మార్చి 12, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో పౌర సేవల్ని త్వరగా అందించేందుకు, సంక్షేమ పథకాల అమలుకు ఫ్యామిలీ కార్డు (ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానం అమలు చేయనున్నారు. అమరావతిలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో త్వరలోనే ఫ్యామిలీ కార్డు (స్మార్ట్ కార్డ్) విధానం తీసుకొస్తున్నామన్నారు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్. ఈ కార్డుతో సంక్షేమ పథకాలను అనుసంధానం చేస్తారని.. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ కార్డుతో సూపర్ సిక్స్ పథకాలను కనెక్ట్ చేస్తామంటున్నారు. అలాగే రాష్ట్రంలో 20 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు అనుసంధానం చేశామన్నారు పీయూష్ కుమార్. ఏపీ ప్రభుత్వం ప్రతి కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొస్తోంది.. ఫ్యామిలీ స్మార్ట్ కార్డును జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డులో 26 అంశాలతో (ఫ్యామిలీ ఐడీ, ఆధార్ నెంబర్, రైస్ కార్డ్ ఐడీ, విద్యార్హతలు, వృత్తి, మొబైల్ నంబర్, చిరునామా, వ్యవసాయ భూమి, అర్బన్-రూరల్ ప్రాపర్టీ వంటి వివరాలు) డేటాబేస్ రూపొందించనున్నారు. ఇప్పటికే 82 శాతం సమాచారం ఉండగా.. ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటా బేస్ సిద్ధం చేస్తామంటున్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించేలా ప్లాన్ చేశారు అధికారులు. ఈ ఫ్యామిలీ కార్డును క్యూఆర్ కోడ్‌తో రూపొందించనున్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన ఆ కుటుంబానికి సంబంధించిన సమాచారం తెలుస్తుంది.. కుటుంబానికి సంబంధించిన పత్రాలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు అంటున్నారు.

# యువనేతలకు పోటీ చేసేదెక్కడ

నెల్లూరు, మార్చి 12, (న్యూస్ పల్స్) వైసీపీ 20 నెలలుగా అధికారం కోల్పోయామనే బాధ వెంటాడుతూనే ఉంది. మళ్లీ పవర్‌లోకి వస్తామా? ఫీల్డ్‌లోకి దిగి పనిచేస్తే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయో? లేదో? అనే డైలమా కంటిన్యూ అవుతోంది. ఓవైపు వైసీపీ లీడర్లు..క్యాడర్..డైలమాలో ఉంటే..కొన్ని చోట్ల టికెట్ ఫైట్ నడుస్తుంది. మరికొన్ని చోట్ల నడిపించే నాయకుడు లేక క్యాడర్ అయోమయంలో పడిపోయిందట. ఇక కొందరు ముఖ్యనేతల పరిస్థితి ఇంకా గమ్మత్తుగా ఉందట. పేరు గొప్పగా ఉన్నా చెప్పుకోవడానికి తమకంటూ ఓ నియోజకవర్గం లేకుండా పోయిందని మధన పడుతున్నారట. వైసీపీకి చెందిన పలువురు యువనేతలు అయితే అధినేత నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారట. గత ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేయాలని ఆదేశిస్తే అక్కడ పోటీ చేశాం. అప్పుడు అధికారం ఉంది గెలుస్తామనే ధీమా ఉండేది. ఇప్పుడు అపోజిషన్‌లో ఉన్నామ్. అసలే పరిస్థితులు బాలేవు. పైగా ప్రతిపక్షంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోయింది. ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉన్నా జమిలి ఎలక్షన్స్ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే త్వరగా ఏదో ఒక నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా నియమిస్తే వెళ్లి అక్కడ పనిచేసుకుంటామంటూ అర్జీలు పెట్టుకుంటున్నారు పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. అప్పటిలోగా రాజకీయంగా అడుగు తీసి అడుగు వేయాలంటే ఆలోచించే పరిస్థితిని ఫేస్ చేస్తున్నారట. తమకంటూ ఓ నియోజకవర్గం లేకుండా పోయిందన్న భావనలో ఉన్నారటవిజయవాడ తూర్పు నియోజకవర్గంలో దేవినేని అవినాష్ యువ నాయకుడిగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. కూటమిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ..బలమైన కౌంటర్ ఇస్తూ నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. పైగా కమ్మ సామాజికవర్గంలో అంతో ఇంతో మద్దతున్న నేత. కానీ వచ్చే ఎన్నికల్లో ఆయన ఎక్కడి నుంచే పోటీ చేస్తారు? అంటే..ఇప్పటికైతే నో క్లారిటీ. దీంతో ఆయన ఎటువైపు అడుగు వేయాలన్నది తేల్చుకోలేకపోతున్నారట. విజయవాడ ఎంపీగా పోటీ చేయాలని కొంతసేపు..కాదు పెనమలూరు నియోజకవర్గం ఇస్తామని మరోసారి..మచిలీపట్నం నుంచి పోటీ చేయించే యోచన అంటూ ఇంకోసారి లీకులు ఇస్తుండటంతో దేవినేని అవినాష్ సందిగ్ధంలో పడ్డారట. ఇక విజయవాడ పశ్చిమలో పోతిన వెంకట మహేష్, వెల్లంపల్లి శ్రీనివాస్ ఇద్దరిలో ఎవరికి టికెట్ ఇస్తారో తెలియని పరిస్థితి. అటు నెల్లూరు సిటీ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అయితే సైలెంట్ మోడ్‌లో ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయనను నరసరావుపేట ఎంపీగా పోటీ చేయించారు. కానీ ఆయన అక్కడ ఓడిపోయారు. దీంతో మళ్లీ తిరిగి తన సొంత నియోజకవర్గానికి వెళ్లాలనుకుంటున్నారు. కానీ అక్కడ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన అడాల ప్రభాకర్‌రెడ్డి మళ్లీ టికెట్ ఆశించే అవకాశం ఉందంటున్నారు. దీంతో తిరిగి సొంత సెగ్మెంట్ నుంచి పోటీ చేయడంపై అనిల్‌కుమార్ యాదవ్‌కు అధిష్టానం నుంచి అభయం దక్కలేదంటున్నారు. అటు గుడివాడ అమర్‌నాథ్ తనను గాజువాక ఇంచార్జ్‌గా నియమించడంపై అసంతృప్తిగా ఉన్నారట. ఇలా గత ఎన్నికల్లో నియోజకవర్గాలు మార్చి అధిష్టానం మరో చోటు నుంచి పోటీ చేయించిన నేతలంతా పొలిటికల్ ఫ్యూచర్‌పై డైలమాలో ఉన్నారట. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలనే దానిపై క్లారిటీ లేకపోవడంతో లైమ్‌లైట్‌లో ఉండేందుకు ఇష్టపడట్లేదట. ఏదో ఒక నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఇప్పటినుంచే పని చేసుకుంటూపోతేనే పట్టు సాధించే అవకాశం ఉంటుందని..లేకపోతే గత ఎన్నికల లాగా లాస్ట్ మూమెంట్‌లో నియోజకవర్గాలు మారిస్తే కష్టమే అంటున్నారు ఫ్యాన్ పార్టీ లీడర్లు. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు జగన్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారట. నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కీలక నేతలు పోటీ చేసే స్థానాలపై వైసీపీ అధినేత ఎప్పుడు డెసిషన్ తీసుకుంటారోనన్నది సస్పెన్స్‌గా మారింది

# బద్వేల్ పట్టణంలో పరిశుభ్రత, భద్రత, అభివృద్ధి మా ధ్యేయం

## మాజీ ఎమ్మెల్యే విజయమ్మ టిడిపి ఇన్చార్జి రితేష్ రెడ్డి

బద్వేలు ,బద్వేల్ పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత ప్రజల భద్రతే తమ ముఖ్య లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ రితేష్ రెడ్డి గురువారం తెలిపారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుండి ఈ రోజు వరకు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ రితేష్ రెడ్డి చొరవతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి పి. నారాయణని కలిసి బద్వేల్ మున్సిపాలిటీకి అవసరమైన నిధులు తీసుకువచ్చి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అమృత్ పథకం కింద సుమారు ?120 కోట్ల వ్యయంతో బద్వేల్ పట్టణంలోని ప్రతి ఇంటికి త్రాగునీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. అదేవిధంగా నాగుల చెరువు సుందరీకరణ కోసం కూడా ప్రత్యేకంగా నీటి వనరులు తీసుకురావడం జరిగిందని వివరించారు. అలాగే పట్టణంలో ఎప్పుడూ లేనివిధంగా సిసి రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, ప్రజలు నివసించే ప్రాంతాల్లోనే రోడ్లు వేయాలనే సంకల్పంతో ప్రజల సమస్యలను గుర్తించి వార్డ్ వారీగా అభివృద్ధి పనులు చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీలో డ్రైనేజ్ వ్యవస్థ కు 32 కోట్ల నిధులు మంజూరు కోసం డీఆర్ ప్రతి వార్డులో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచడానికి తయారు చేస్తున్నామని తెలిపారు.

# అభయారణ్యానికి చేరుకున్న పెద్దపులి

కాకినాడ , కాకినాడ జిల్లాలో కలవరపెడుతున్న పెద్దపులి ప్రత్తిపాడు మండలం దారపల్లి జలపాతానికి చేరువలో అభయారణ్యానికి చేరుకుంది. పెద్ద పులి సంచారం పోలవరం ,కాకినాడ జిల్లాలలో కలకలం రేపింది. పులి కదలికలను అటవీ అధికారులు విహెచ్‌ఎఫ్ ఆధారంగా గుర్తించారు. లాట్ లాంగ్ ద్వారా వ్యాఘ్ర గమనాన్ని గుర్తిస్తున్నారు. దారపల్లి పరిసర ప్రాంతాలన్నీ ఎత్తైన కొండలు దట్టమైన అడుగుతో ఉండడంతో డ్రోన్ కెమెరా ద్వారా బెంగాల్ టైగర్ ను బంధించడం వీలు కావట్లేదు. పులి సంచారంతో అప్రమత్తమైన యంత్రాంగం, హుటాహుటిన దారపల్లి కి చేరుకుంది. ఆర్డీవో శ్రీధర్, తాసిల్దార్ సూర్యప్రభ ప్రజలను అప్రమత్తం చేసారు. అధికారులు పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దారపల్లి సమీపంలో మార్గాల్లో రాకపోకలపై ఆంక్షలు విధించారు. బురద కోట కొండపై ఉన్న నాలుగు తండాలు గోకవరం పులి గోగుల మెట్టు చింత మూరుపేట గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలకు జాగ్రత్తలు సూచనలు ఇచ్చారు. జలపాతానికి వెళ్లే మార్గాలను మూసివేసినట్లు ఏలేశ్వరం ఎఫ్ఆర్ఓ దుర్గా రాంప్రసాద్ ప్రకటించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని సాధ్యమైనంత వరకు ఇళ్ళలోనే ఉండాలని ఎమ్మెల్యే సత్య ప్రభ సూచించారు.

## 15 వ తేదీ ఆదివారం శ్రవణా నక్షత్రమును పురస్కరించుకొని శ్రీ శ్రీనివాస కళ్యాణం..



విభారే న్యూస్ మార్చి 12 ఎమ్మిగనూరు..ఓం నమో వెంకటేశాయ ప్రతి నెల శ్రవణా నక్షత్రము నందు శ్రీ శ్రీనివాస కళ్యాణం సామూహికంగా జరపడం జరుగుతుంది కావున భక్తాదులు చేయించ దలచినవారు 200 రూపాయలు చెల్లించి మీ పేరును నమోదు చేయించుకోవలెను ఈ నెల 15/03/2026 ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రవణా నక్షత్రము నందు శ్రీనివాస కళ్యాణం చేయడం జరుగుతుంది. వేదిక : శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, వెంకటాపురం. కర్తృ సేవ : 5000రూపాయలు ఉంటుంది (దంపతులు కూర్చోబెట్టి వారితో కైకర్యాలని చేయించి. కల్యాణ ప్రసాదం ఇవ్వబడును)ఆలయ అర్చకులు మొబైల్ నెంబర్ 9052510491..

## భాష్యం పాఠ-శాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు..





విభారే న్యూస్ మార్చి 12 ఎమ్మిగనూరు...భాష్యంవిద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, రాయలసీమ (5) జెడ్ఈఓ మాచని కవిత ఆదేశాల మేరకు పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా జెడ్ఈవో మాచాని కవిత మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ఐదవ తరగతి పూర్తిచేసుకుని ఆరవ తరగతికి వెళ్తున్నందున వారికి విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేయడం జరిగిందని తెలిపారు ఈ గ్రాడ్యుయేషన్ డే జరపడం పిల్లలను పై తరగతులకు వెళ్ళటానికి ప్రోత్సహించడమని చెప్పారు.ఇందులో పాఠశాల హెచ్ఎం అనురాధ ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

## 15వ తేదీ ఆదివారం మీన సక్రమణం సందర్భంగా సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ మార్చి 12 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో 15/03/2026 అనగా ఆదివారం ఫాల్గుణ మాసనీ మున.మీన సంక్రమణం రోజున ఛాయ ఉషా సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి విశేషంగా సుగంధ ద్రవ్యములతో అరుణ పారాయణ పూర్వకంగా అభిషేకము జరుగును ఇందులో భాగంగా మీనరాశి వారు పూర్వాభాద్ర. ఉత్తరాభాద్ర.రేవతి నక్షత్ర జాతకులు జాతక రీత్యా అద్భుతమైన ఫలితాలు ఆయురారోగ్యాలుఐశ్వర్యములు పొంది శ్రీ సూర్యనారాయణ స్వామివారి కృపకు పాత్రులు కాగలరు. అభిషేక సంకల్పం-116ప్రధానముగా అభిషేకం -1116 హోమ సంకల్పం -116 హోమం ప్రధానంగా -2500 సంప్రదించవలసిన నెం-98668002207981012787దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు.8896123777ఆఫీసు ల్యాండ్ ఫోన్ నెంబరు..08518-234388.



## రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్ వాష్ అండ్ గో' తనిఖీలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 12:జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు నంద్యాల పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనాలపై 'స్టాప్ ? వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహిస్తూ విస్తృత తనిఖీలు చేస్తున్నారు.కడప?నంద్యాల హైవే, కర్నూలు?విజయవాడ మార్గం, నంద్యాల?కర్నూలు ఎన్హెచ్-44 హైవే, కర్నూలు?బెంగుళూరు మార్గాల్లో అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు వాహనాలను ఆపి తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ మరియు ట్రావెలింగ్ బస్సులలో భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు.వాహనాల దస్తావేజులు, డ్రైవింగ్ లైసెన్సులు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తూ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. అధిక వేగం, రాంగ్ రూట్ ప్రయాణం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి నిబంధనలు ఉల్లంఘించిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ప్రజల భద్రతే లక్ష్యంగా ఈ తనిఖీలు కొనసాగుతాయని నంద్యాల జిల్లా పోలీసులు తెలిపారు.

## నంద్యాలలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 12:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా నంద్యాలలో పార్టీ శ్రేణులు ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి నాయకత్వంలో, ఎమ్మెల్సీ ఇస్సాక్ భాషా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పార్టీ నాయకులు ముందుగా దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే పట్టణంలోని శ్రీనివాస సెంటర్, వైఎస్సార్ సర్కిల్, సాయిబాబా నగర్ ప్రాంతాల్లో ఉన్న డా. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, ఎస్ఈసీ సభ్యుడు రామలింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇస్సాక్ భాషా, పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ 15 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోందన్నారు. నవరత్నాల వంటి పథకాల ద్వారా పేదల అభివృద్ధికి పార్టీ కృషి చేసిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



## ఉగాది రద్దీ దృష్ట్యా దర్శన సమయాల్లో మార్పులు--

### మహానంది ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 12: ఉగాది పండుగ సందర్భంగా కర్ణాటకతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శ్రీ స్వామి అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశముండటంతో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మార్చి 13వ తేదీ నుండి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు దర్శన, సేవా కార్యక్రమాల సమయాల్లో మార్పులు అమలు చేయనున్నారు.ప్రతిరోజు నిత్య పూజలు పూర్తైన అనంతరం సాయంత్రం 5 గంటలకు అష్టవిధ మహా మంగళ హారతులు నిర్వహించి, అనంతరం ఇతర సేవలు మరియు దర్శనాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలని ఆలయ సిబ్బందికి సూచించారు.అదేవిధంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రేపటి నుండి ఆలయం వెలుపల రెండు మెయిన్ బుకింగ్ కౌంటర్లు, రెండు ప్రసాదం కౌంటర్లను నిరంతరంగా నిర్వహించనున్నట్లు ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



## శానిటేషన్ వర్కర్లకు నూనె, సబ్బులు అందజేత--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 13:స్వచ్ఛ సర్వేక్షణ్ 2025?26 కార్యక్రమంలో భాగంగా నంద్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయంలో 334 మంది శానిటేషన్ వర్కర్లకు ఒక్కొక్కరికి 4 లీటర్ల కొబ్బరి నూనె. 15 సబ్బులను పంపిణీ చేశారు. నగర పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న శానిటేషన్ కార్మికుల సేవలు అమూల్యమని ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యం, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. అనంతరం శానిటేషన్ వర్కర్స్ కు శాలువా పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌బీసీ ఉద్యోగి ఆకస్మిక మృతి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 12:నంద్యాల సమీపంలోని గోరకల్లు ఎస్ఆర్‌బీసీ డివిజన్?4లో టెక్నికల్ అధికారిగా పనిచేస్తున్న అంబడిపూడి కిరణ్ కుమార్ గురువారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఉదయం సమయంలో ఆయనకు తీవ్ర అస్వస్థత కలగడంతో సహచరులు ఆసుపత్రికి తరలించేలోపే బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.కిరణ్ కుమార్ ఇటీవల జనవరి నెలలో సర్కిల్?1 నుంచి పదోన్నతిపై గోరకల్లు డివిజన్‌కు బదిలీపై వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసే అధికారిగా సహచరుల మధ్య మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన ఆకస్మిక మృతి ఎస్ఆర్‌బీసీ విభాగంలో తీవ్ర విషాదాన్ని కలిగించింది.మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కిరణ్ కుమార్ మృతి పట్ల విభాగ అధికారులు, సహచర ఉద్యోగులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ సహచరులు నివాళులు అర్పించారు.

## దేవాలయ స్థల ఆక్రమణపై మంత్రి లోకేశు ఫిర్యాదు..



విభారే న్యూస్ మార్చి 12 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరులోని కోతుల బావి ఆంజనేయస్వామి దేవాలయ స్థల ఆక్రమణ అంశాన్ని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి.. సనాతన ధర్మం, దేవాలయాల జోలికి వచ్చేవారిని ఉపేక్షించే పరిస్థితి లేదని హెచ్చరించారు.కోతుల బావి దేవాలయ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## లక్ష్మీనరసింహ (ఈరన్న) స్వామి దేవస్థాన అధ్యక్షులు పాండురంగయ్య శెట్టిని సన్మానించిన ఎమ్మిగనూరు ఆర్యవైశ్య సంఘ కార్య సభ్యులు..



విభారే న్యూస్ మార్చి 12 కౌతాళం..ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం పాలక మండలి అధ్యక్షులుగా నియమింపబడిన టి.జి. పాండురంగయ్య శెట్టి ని గురువారం ఆదోనిలో వారి స్వగృహం నందు ఎమ్మిగనూరు ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు కలిసి సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా పాండురంగయ్య శెట్టి మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఆర్యవైశ్యులు అంటే తనకు ఎంతో అభిమానమని మీ అందరికీ తన సహకారం అన్నివేళలా ఉంటుందని తెలియజేశారు.

## పన్ను ఎగవేతలపై కఠిన చర్యలు

### -- సీఎం చంద్రబాబు నాయుడు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 12:రాష్ట్రంలో పన్ను ఎగవేతలకు అవకాశం లేకుండా పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలో జరుగుతున్న 6వ జిల్లాల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆదాయార్జన శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఇండస్ట్రీ, సర్వీస్ రంగాల అభివృద్ధితో ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ప్రతి రంగంలో వృద్ధి సాధించడం ద్వారా జీఎస్డీపీ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.ఇతర రాష్ట్రాల్లో కార్యాలయాలు పెట్టుకుని మన రాష్ట్రంలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు చెల్లించే పన్నులు ఏపీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వేలు తదితర ప్రాజెక్టుల్లో కూడా పన్నులు రాష్ట్రంలోనే చెల్లించేలా చూడాలని చెప్పారు.పన్ను వసూళ్లలో అనవసర వేధింపులు చేయకుండా, ఎవరూ పన్నులు తప్పించుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించి పన్ను ఎగవేతలను గుర్తించాలని అధికారులకు సూచించారు.

## కాలువలు లేక సాగునీరు దూరం--

### సాగునీటి సాధన సమితి విమర్శ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 12 :కృష్ణా, తుంగభద్ర నదుల్లో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ పంట కాలువల నిర్మాణం పూర్తికాక రాయలసీమలో లక్షల ఎకరాలు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నాయని రాయలసీమ సాగునీటి సాధన సమితి విమర్శించింది. పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ "తెలుసుకో నాయకా? ఏది ముందో ఎరగరా?" అనే సందేశాత్మక ఆడియో గీతాన్ని గురువారం నంద్యాలలో విడుదల చేశారు.సమితి నాయకులు మాట్లాడుతూ, ప్రాజెక్టులు పూర్తయ్యాయని ప్రచారం చేస్తున్నప్పటికీ కాలువలు లేక రైతుల పొలాలకు నీరు చేరడం లేదన్నారు. పంట కాలువలు నిర్మిస్తే వచ్చే ఏడాదికే సుమారు ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న కాలువల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190